క్లుప్తంగా

నేడు ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

కొల్లిపర: మండల పరిషత్ కార్యాలయంలో సోమ, మంగళవారాలలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ పరిపాలన విధానంపై ఉపసర్పంచ్‌లకు, ఇద్దరు వార్డు మెంబర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుందని, కావున మండలంలోని 20 గ్రామాల పంచాయతీ ఉపసర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ పరిధిలోని ఇద్దరు వార్డు మెంబర్లు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం దుకాణాలకు ఎవరైనా టెండర్లు వేయొచ్చు

–తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం

తెనాలిరూరల్: మద్యం దుకాణాలకు ఎవరైనా టెండర్లు వేయవచ్చని తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో లేదా తమ కార్యాలయంలో టెండర్లు వేయవచ్చని చెప్పారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా నిర్దేశిత రుసుము రూ. 2 లక్షలు చెల్లించవచ్చని, లేదా ఎక్సైజ్ కార్యాలయంలో నగదు చెల్లించి/ డీడీ తీసి టెండరు వేయవచ్చన్నారు. ఒకే షాపునకు ఒకే వ్యక్తి ఎన్ని టెండర్లయినా వేయవచ్చని తెలిపారు. తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలోని తెనాలి టౌన్, తెనాలి మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో మొత్తం 25 దుకాణాలకు టెండర్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా చేపడుతున్నామని, 11వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పూర్తి పారదర్శకంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీస్తారని వెల్లడించారు.

కార్తీక వనసమారాధన పోస్టర్ ఆవిష్కరణ



తెనాలి: 13వ చంద్రవంశ క్షత్రియ యాదవరాజుల కార్తీక వనసమారాధన నవంబరు 13వ తేదీన జరుగుతుందని యాదవ సంఘీయులు వెల్లడించారు. స్థానిక రైల్వేస్టేషను రోడ్డులోని బృందావన్ హోటల్ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం మధ్యాహ్నం వనసమారాధన మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణ సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో జరిగే వన సమారాధనలో యాదవ సంఘీయులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ తాడిబోయిన అవినాష్, ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికా రమేష్, కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, రెయిన్ బో పాఠశాల చైర్మన్ దొడ్డక ఆదినారాయణ, బ్యాంక్ న్యాయసలహాదారు తాడిబోయిన బుచ్చిరాజు, తాడిబోయిన లక్ష్మీనారాయణ, దరిశి శివశంకరరావు, కరేటి లక్ష్మీనారాయణ, విశ్రాంత తహసీల్దార్ తాడిబోయిన వసంతరావు పాల్గొన్నారు. యాదవసంఘీయుల అభివృద్ధికి పలు సూచనలు చేశారు.

20న తెనాలిలో ధార్మిక శిక్షణ తరగతులు

జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు



తెనాలి: సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి మండల కమిటీ సమావేశం ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీగోవర్ధనస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహించారు. సంస్థ తెనాలి సబ్‌డివిజన్ కన్వీనర్ కడియాల సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ తెనాలి సబ్‌డివిజన్ గ్రామ ధార్మిక సమితి కన్వీనర్ల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ ధర్మ రక్షణ కోసం గ్రామ ధార్మిక సమితుల సభ్యులకు అవగాహన కలిగించాలనే భావనతో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈనెల 12న రెండవ శనివారం సత్సంగం, 16 17 తేదీల్లో పౌర్ణమి హారతులు, నగర సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో మండల కన్వీనర్ దీపాల మహేష్, నగర కన్వీనర్ కోనపురెడ్డి బైరాగి, కొతరపు రామచంద్రరావు, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు

తొమ్మిది మంది పేకాటరాయుళ్లు అరెస్ట్

మున్నంగి(కొల్లిపర): మండల పరిధిలోని మున్నంగి గ్రామం శివారు పంట పొలాల్లో రహస్యంగా పేకాటాడుతున్న తొమ్మిది మందిని ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పేకాటాడుతున్న తొమ్మిది మంది వద్ద నుంచి రూ.15,150 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వెంట ఏఎస్ఐ పోతురాజు, కానిస్టేబుల్ తాతారావు ఉన్నారు.

పద్యానికి పూర్వవైభవం!

- సమకాలీన సాంఘిక పద్యనాటకం
- 'కళల కాణాచి' తెనాలిలో సరికొత్త ప్రయోగం
- రేపటి నుంచి జరిగే వీణా అవార్డ్స్ నాటక పోటీల్లో ప్రదర్శనలు



పౌరాణిక పద్యనాటకంలో సన్నివేశం

తెనాలి: నాటకం కాంట్రాక్టు సమాజాల చేతుల్లో పడి అపసవ్య ధోరణలను తలకెత్తుకున్న రోజుల్లో 1929 జూన్ 19,20,21 తేదీల్లో తెనాలిలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్ సమావేశాలు ఆంధ్ర ప్రాంతంలో తెలుగు నాటకానికి ఒక దశ దిశను నిర్దేశించాయి. నాటకాల్లో స్త్రీలు నటించటం సరికాదన్న ధోరణిని ఖండించి, స్త్రీలు కూడా భాగస్వాములైతేనే నాటకానికి పరిపూర్ణత లభిస్తుందని నొక్కిచెప్పాయి. పౌరాణిక పద్యనాటకం ప్రాభవం కోల్పోతున్న ప్రస్తుత తరుణంలో మనదైన పద్యాన్ని కోల్పోకుండా సాంఘిక నాటకాల్లో చొప్పించి, ప్రేక్షకాదరణ పొందాలనే ప్రయత్నం తెనాలి నుంచి ఆరంభం కావటం విశేషం. 'వరవిక్రయం', 'మధుశాల', 'చింతామణి'... ఇవన్నీ మహానుభావుడు కాళ్లకూరి నారాయణరావు రాసిన సాంఘిక పద్య నాటకాలు. దశాబ్దాల క్రితం తెలుగు ప్రేక్షకులను ఆనందింపజేసి, ఆలోచనను రేకెత్తించేలా చేశాయి. చింతామణి నాటకం నిషేధానికి గురయ్యేవరకు ప్రదర్శితమవుతూనే వచ్చింది. మిగిలినవి జనబాహుళ్యానికి దూరమయ్యాయి. మరోవైపు పౌరాణిక పద్యనాటకాలు జనంలోకి విపరీతంగా వెళ్లాయి. పద్యమంటే పౌరాణిక కథాంశాలతో కూడిన నాటకాలేనన్న భావన పడిపోయింది. వర్తమానంలోకి వస్తే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పౌరాణిక నాటకాలను ఆడే సమాజాలు ఒకటొకటిగా మూతపడుతున్నాయి. రంగస్థలంపై రాణించిన ఒకనాటి పద్యనాటక కళాకారులు వయోభారంతో రంగస్థలానికి దూరమయ్యారు. కొత్తగా ముఖానికి రంగేసుకునేవారు కనిపించటం లేదు. పరిషత్ పోటీలు మాత్రమే నాటక ప్రదర్శనలకు వేదిక కల్పిస్తున్నాయి. పండగలకు, పబ్బాలకు గ్రామీణ ప్రాంతాల్లో నాటకాలు వేయించే నిర్వాహకుల్లో ఇప్పుడా ఆసక్తి తగ్గిపోయింది. టీవీలు, సినిమాలు...ఓటీటీల ప్రభావంతో నాటక ప్రదర్శనలకు వస్తున్న ప్రేక్షకుల సంఖ్య పడిపోయింది.

పారితోషికం.. ఘనం

ప్రతి సాంఘిక పద్యనాటకానికి ప్రదర్శనకు ఇచ్చే పారితోషికం రూ.50 వేలతోపాటు, నాటక రచయితకు ప్రత్యేకంగా రూ.25 వేల నగదును ఇవ్వటం గొప్ప విషయం. తొలి ఏడాది అయినందున సాంఘిక పద్యనాటకాలను పోటీ నుంచి మినహాయించారు. ఆయా నాటకాల్లో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల్లో ఉత్తములకు వ్యక్తిగత బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం నుంచి సాంఘిక నాటకం, రాత్రికి రెండేసి నాటికల చొప్పున పోటీ ప్రదర్శనలు జరుగుతాయి. కళల కాణాచి ఆధ్వర్యంలో ఏడాదిక్రితం తెనాలిలో జరిగిన సదస్సులో డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఇచ్చిన హామీని ఈవిధంగా ఆచరణలోకి తీసుకొచ్చారు. పద్యానికి ఆదరణ తగ్గిపోతున్న నేటిరోజుల్లో తెలుగువారి సొంతమైన పద్యాన్ని మళ్లీ బతికించుకోవాల్సిన అవసరం ఉందంటూ కళల కాణాచి వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా చెప్పారు. అంతేకాకుండా నాటక రచయితలు సమకాలీన సాంఘిక నాటకాల ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామనీ, నాటక రచయితకు రూ.25 వేల పారితోషికం ఇస్తామని ప్రకటించారు. ఆ ప్రకటన ఇప్పుడు కార్యరూపంలోకి తీసుకొచ్చారు.

మళ్లీ ప్రేక్షకులను రప్పించే యత్నం..

సాంఘిక పద్యనాటక ప్రదర్శనలు విజయవంతమైతే, మళ్లీ నాటక రచయితలు, సమాజాల వారు వాటికేసి చూసే అవకాశముంది. పౌరాణిక నటులు, నాటక ప్రదర్శనలు తగ్గిపోతున్న తరుణంలో పద్యాన్ని మళ్లీ సాంఘిక నాటకంతో సహా జనంలోకి తీసుకెళ్లే ప్రయత్నం ఆరంభించొచ్చు. పౌరాణిక నాటకాల్లోలాగా సుదీర్ఘ రాగాలాపన , హోరెత్తే సంగీతాన్ని జోడించకుండా పాత్రోచితమైన పద్యాలను హృద్యంగా పాడగలిగితే మళ్లీ ప్రేక్షకుల ఆదరణను పొందగలమనేది నిర్వాహకుల భావన. అందుకు ఈ పోటీలు నాంది కాగలవన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సరికొత్త ప్రయోగానికి సిద్ధం

ఇన్ని ప్రతికూలతల నేపథ్యంలో కళలకు నెలవైన తెనాలిలో కళల కాణాచి–తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్ కొత్త ప్రయోగానికి సంసిద్ధమైంది. వీణా అవార్డ్స్ పేరుతో అటు పౌరాణిక నాటకాలు, సాంఘిక నాటకాలు, నాటికల పోటీలను నిర్వహిస్తూ వస్తున్న ఈ నాటక సమాజాలు 2024 సంవత్సరంలో పౌరాణిక పద్యనాటకాల స్థానంలో 'సమకాలీన సాంఘిక నాటకాలు' తీసుకోవటం గొప్ప సాహసం. ఈనెల 8వ తేదీనుంచి 12వ తేదీ దసరా పర్వదినం వరకు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగే నాటక పోటీల్లో ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు సమకాలీన సాంఘిక నాటకాలను ప్రదర్శించనున్నారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యలు/ముఖ్యమైన అంశాలపై రాసిన నాటకాలివి. ఆ విభాగంలో స్క్రూటినీకి వచ్చిన ఆరు నాటకాలనూ ప్రదర్శనకు అనుమతించారు.

పద్యంపై ఇష్టం కలిగించాల్సిన బాధ్యత మనదే...



ఉప్పుకప్పురంబు ఒక్క పోలికనుండు...అనే పద్యం చెప్పిన భావం సూటిగా జనంలోకి చొచ్చుకుపోతుంది. పద్యానికున్న గొప్పదనమది. దీనిని పోగొట్టుకుంటే భాష, భావితరం మనల్ని క్షమించదు. అందుకే సాంఘిక పద్యనాటకాలు అనే ప్రక్రియను కొత్తగా ప్రజల్లోకి తీసుకొస్తున్నాం. పద్యాన్ని యువత ఇష్టపడటం లేదంటున్నారు...ఇష్టం కలిగేలా చేయాల్సిన బాధ్యత, కర్తవ్యం మనదే.

– డాక్టర్ సాయిమాధవ్ బుర్రా,
సినీ రచయిత, వ్యవస్థాపకుడు, కళల కాణాచి

కళాకారులకు తెనాలిలో 'రంగస్థల దసరా'



తెనాలి: రాష్ట్రంలోని కళారంగంలోని వారికి తెనాలిలో రంగస్థల దసరా ఆరంభమవుతోందని కళల కాణాచి వ్యవస్థాపకుడు, సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. వేదగంగోత్రి ఫౌండేషన్- విజయవాడతో కలిసి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఈనెల 7–12 తేదీల్లో జరగనున్న వీణా నాటకోత్సవాల బ్రోచర్‌ను ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. జాతీయస్థాయి చతుర్థ సాంఘిక పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీల వివరాలను తెలియజేశారు. తొలిరోజున జిల్లాకు చెందిన నాటకరంగ దిగ్గజాలు వల్లూరు వెంకట్రామయ్య చౌదరి, కొడాలి గోపాలరావు, కన్నెగంటి నాసరయ్య, బెల్లంకొండ రామదాసు శతజయంతి ఉత్సవాల సదస్సు, వారి పేరిట ప్రస్తుత రంగస్థల నటులు/రచయితలకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. మధ్యలో శ్రీదుర్గాభవాని నాట్యమండలిచే శ్రీకృష్ణరాయబారంలో నాటక సన్నివేశ ప్రదర్శన ఉందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు సమకాలీన సాంఘిక పద్యనాటకం, మధ్యాహ్నం 2 గంటలకు సాంఘిక నాటకం, సాయంత్రం రెండేసి నాటికల చొప్పున ప్రదర్శనలు ఉంటాయన్నారు. తొలిరోజున పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, విశ్లేషకుడు డాక్టర్ డీఎస్ఎన్ మూర్తికి ప్రదానం చేస్తారు. ముగింపురోజైన 12న ప్రఖ్యాత రంగస్థల నటుడు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని రాష్ట్రంలోని పేరెన్నికగన్న రంగస్థల నటుడు యడ్ల గోపాలరావుకు ప్రదానం చేస్తామని వివరించారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, గోగినేని కేశవరావు, అయినాల మల్లేశ్వరరావు, అలపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీ నమోస్తుతే!

తెనాలిలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం వివిధ దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేశారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– తెనాలి



తెనాలి మారిస్ పేటలో అమ్మవారికి శ్రీవారాహి దేవి అలంకారం



తెనాలి దేవీచౌక్‌లోని రాజరాజేశ్వరిదేవికి శ్రీసంతాన లక్ష్మీదేవి అలంకారం



తెనాలి రామలింగేశ్వరపేటలో అమ్మవారికి శ్రీలలితాదేవి అలంకారం



తెనాలి రామస్వామి పేటలో శ్రీ గజలక్ష్మి దేవిగా శ్రీఅష్టలక్ష్మీ సహిత దుర్గాదేవి



నందివెలుగు కనకదుర్గదేవికి శ్రీమహాలక్ష్మి దేవి అలంకారం



తెనాలిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీగాయత్రీ దేవి అలంకారం

దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన జగ్జీవన్‌రామ్



మాట్లాడుతున్న కృష్ణమాదిగ, వేదికపై బాబురావు, శామ్యూల్‌ఆనంద్, ఆనంద్‌కుమార్ తదితరులు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ
- చినరావూరులో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఆవిష్కరణ

తెనాలిరూరల్: దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన ఏకైక వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ అన్నారు. పట్టణ చినరావురుకు చెందిన బాబు జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణమాదిగ మాట్లాడుతూ 1934 నుంచి 1986 వరకు 52 ఏళ్ల పాటు దేశానికి జగ్జవన్‌రామ్ ఎన్నో సేవలందించారని, కేంద్రంలో సుదీర్ఘకాలం కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారని గుర్తుచేశారు. రాజ్యాంగ నిర్మాణం, ముసాయిదా తయారీలో అన్ని సబ్ కమిటీల్లో జగ్జీవన్‌రామ్ కీలక సభ్యుడిగా ఉన్నారని, భారత రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. జగ్జీవన్‌రామ్ చరిత్రను కొందరు వక్రీకరించారని, అసత్యాలను ప్రచారం చేశారని చెప్పారు. పదేళ్ల పాటు రిజర్వేషన్లు అమల్లో ఉండాలని అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిస్తే, ఆ పదేళ్ల అనంతరం, సాంఘిక దురాచారాలు ఉన్నంతవరకు రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని 1980 వరకు జగ్జీవన్‌రామ్ పోరాడారని తెలిపారు. జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. జగ్జీవన్‌రామ్ చరిత్రను ఉన్నది ఉన్నట్టు తెలిపే బాధ్యత ఎమ్మార్పీఎస్‌పై ఉందని చెప్పారు. ఆగస్ట్ 1వ తేదీన వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వస్తే 32 రివ్యూ పిటీషన్లను వేశారని, వర్గీకరణను వ్యతిరేకించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఈ పిటీషన్లకు కొట్టివేయడం వర్గీకరణ ధర్మబద్ధమైనది గుర్తించడమేనన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చే అంశంపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మతం మారిన ఎస్టీలు, బీసీలు, అగ్రవర్ణాలకు వారి వారి రిజర్వేషన్లు అమలవుతున్నాయని, దళితులకే ఎందుకు అమలు కావడంలేదో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇందుపల్లి శామ్యూల్ ఆనంద్, విశ్రాంత అదనపు డీజీపీ కూచిపూడి బాబురావు, జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్(ఆడిట్) పులిపాక ఆనంద్‌కుమార్ మాట్లాడారు. విశ్రాంత ఐఆర్‌టీఎస్ అధికారి కొత్తపల్లి బాబురావు, కొండమేది భగవాన్‌దాస్, విశ్రాంత డీఐజీ చావలి బాలస్వామి, విగ్రహ దాత మొండితోక మణికిషోర్, చందోలు ప్రసూనరాజు, వేజండ్ల సురేష్‌బాబు, బొబ్బిళ్లపాటి ప్రసాద్‌బాబు, కూచిపూడి రాజేష్, సాపాటి కిరణ్, అత్తోట శ్యామ్, కూచిపూడి సత్యం, రుద్రపోగు సురేష్ పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ అవసరం

మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు



కొల్లిపర: ప్రస్తుతం వరి చేలు పొట్ట, చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని కొల్లిపర మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు పేర్కొంటున్నారు. వరిసాగులో పాటించాల్సిన మెలకువలపై ఆయన సలహాలు సూచనలు...



చిరు పొట్ట దశలో ఉన్న వరి

- వరికి మోతాదుకు మించి యూరియా వేస్తే అనేక తెగుళ్లు వ్యాపిస్తాయి. వరి పంటకు చిరు పొట్ట దశలో ఎకరానికి 40 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలపి వేయాలి. పంటకు నీరు అధికంగా పెట్టాలి. పొట్ట దశలో వరి పంటకు ప్రధానంగా అగ్గితెగులు, పాముపొడ తెగులు , దోమపోటు లాంటి తెగుళ్లు అధికంగా వ్యాపిస్తాయి. సన్నరకం ధాన్యం పంటలో ఈ తెగుళ్లు అధికంగా వ్యాపిస్తాయి. వరి కర్ర మొదట్లో చిన్న చిన్న పురుగులు నీటి మట్టం పైకి పాకుతుంటాయి. ఈ పురుగుల నివారణకు ఎకరానికి 350 మి.లీ బుప్రోజిన్ పిచికారీ చేయాలి.
- పాము పొడ తెగులు, అగ్గి తెగులు మోతాదుకు మించి యూరియా వేయడం వల్ల వ్యాపిస్తాయి. వరి పంట ఆకుపై ఇటుక పొడి రంగులో నూలు కండె ఆకారపు మచ్చలు ఏర్పడితే అగ్గితెగులుగా గుర్తించాలి. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలి. కాండం మీద నల్లటి మచ్చలు ఏర్పడితే పాముపొడ తెగులుగా గుర్తించాలి. దీని నివారణకు హెక్సాకోనాజోల్ 400 మిలీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలి. రెండు కలిసి ఉంటే 400 మిలీ లీటర్ల టిబుకోనాజోల్ పిచికారీ చేయాలి. మానుపుండు తెగులు నివారణకు ఎకరానికి 200 మిలీ ప్రొపికొనాజోల్ 200 లీటర్ల నీటిలో కలపి పిచికారీ చేయాలని సూచించారు.

సంక్రాంతి నాటికి చినరావూరు పార్కును అభివృద్ధి చేస్తాం



తెనాలిఅర్బన్: చినరావూరు పార్కులో ఆహ్లాదాన్ని అందించే అన్ని రకాల మౌలిక వసతులను సంక్రాంతి నాటికి ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్ ఆధ్వర్యంలో రూ.5లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను ఆదివారం సాయంత్రం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గతంలో తెనాలి పట్టణంలో అనేక పార్కులు ఉండేవని చెప్పారు. వాటిలో కొన్ని కబ్జాకు గురవగా, కొన్నింటిని ఇతర అవసరాలకు వినియోగించారని వివరించారు. దీనివలన పట్టణవాసులకు ఆహ్లాదం కరువైందన్నారు. పట్టణంలో ఖాళీగా ఉన్న మున్సిపల్ స్థలాలను గుర్తించాలని కమిషనర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. వాటిలో పిల్లల వస్తువులను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఐతానగర్‌లోని పార్కును పీపీపీ పద్ధతిపై రూ.కోటితో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని చెప్పారు. అనుమతులు రాగానే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పార్కులోని మ్యూజికల్ ఫౌంటేన్‌ను పరిశీలించారు. అది పాడై ఉండటంతో క్రిస్మస్ నాటికి దానికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని ఏఈ చైతన్యను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా బోటును నడపాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, హార్టికల్చర్ అధికారి శేషుబాబు, డీఎస్పీ జనార్ధనరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మనోధైర్యంతోనే క్యాన్సర్‌పై విజయం

లక్ష్మీపురం: ఆధునిక వైద్య విధానాలతో పాటు రోగి మనోధైర్యం క్యాన్సర్‌పై విజయంలో కీలకంగా నిలుస్తుందని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎస్.ఫణింద్ర కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్యసభ ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. క్యాన్సర్ వ్యాధి- కారణాలు- చికిత్స' అన్న అంశంపై నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజల ప్రాణాలను పొట్టను పెట్టుకుంటున్న వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనదని వివరించారు. భారత్‌కి క్యాన్సర్ సునామి పొంచి ఉందంటే అతిశయోక్తి కాదన్నారు. సంస్థ సభ్యుల సందేహాలను డాక్టర్ ఫణీంద్ర కుమార్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ ఫణీంద్ర కుమార్‌ను సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమాన్ని సంస్థసభ్యులు టీవీ సాయిరాం సమన్వయం చేశారు. సంస్థ సభ్యులు చల్లా అంజిరెడ్డి, రవిచంద్ర ప్రసంగించారు.



వరద బాధితులను ఆదుకునేందుకు సేకరించిన రూ.1.41లక్షల నగదుకు సంబంధించిన చెక్కును తెనాలికి చెందిన ఎలైట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అందజేశారు. చినరావూరు పార్కులో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

– తెనాలిఅర్బన్

నేడు గ్రీవెన్స్

తెనాలిరూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పట్టణ రామకృష్ణ కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించనున్నట్లు డీఎస్పీ బి.జనార్ధనరావు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అధికారులందరూ అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.